క్లుప్తంగా

జోన్‌–5 స్పందనకు నాలుగు వినతులు


వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్‌–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 వినతులు అందాయి. జోనల్‌ కమిషనర్‌ ఆర్‌.జి.వి.కృష్ణ అర్జీలు స్వీకరించి పరిశీలించారు.త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. టౌన్‌ ప్లానింగ్‌ విభాగానికి 02, పబ్లిక్‌ హెల్త్‌కు 01, యూసీడీకి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్‌ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్‌ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ ప్లానింగ్‌ అధికారి అపరంజిత, పబ్లిక్‌ హెల్త్‌ సూపర్‌వైజర్‌ జనార్దన్‌, టీపీఆర్వో ఏపీడీ కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం


పారిశుధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సిస్టర్‌ సింధు

మల్కాపురం: మల్కాపురం బ్రహ్మకుమారీస్‌ కేంద్రం సిస్టర్‌ బీకే సింధు సోమవారం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. రోడ్లు, వీధులను పరిశుభ్రంగా ఉంచడంలో ఎంతగానో శ్రమిస్తున్నారని, ముఖ్యంగా కరోనా వ్యాప్తి సమయంలో పారిశుధ్య కార్మికులు సేవలు ఎనలేనివని కొనియాడారు. వారికి మెడల్స్‌, సర్టిఫికెట్లు అందజేశారు.

పాదరక్షలు, గొడుగుల పంపిణీ


పేదలకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవం సందర్భంగా సోమవారం సుసర్ల కాలనీలో పేదలకు పాదరక్షలు, గొడుగులను ఎమ్మెల్యే గణబాబు అందించారు. సాయి భక్తులు మంచి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామరని ఆయన అభినందించారు. కార్యక్రమంలో 90వ వార్డు కార్పొరేటర్‌ బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


బాండ్‌ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం విజయవాడకు చెందిన మంచకొండ సాయి అశ్విత నరసమ్మ అనే దాత రూ.లక్ష విరాళం అందజేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌ బోర్డు సభ్యుడు కురకుల నాగేశ్వరరావు సంబంధిత విరాళాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్‌ ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్‌, సంపంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భయం..భయం!

- ప్రమాదకరంగా పురాతన భవనాలు
- భయాందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
- శిథిల భవనాలు తొలగించాలని డిమాండ్‌


జీవీఎంసీ పాఠశాలను ఆనుకుని ఉన్న పురాతన భవనం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని పలు పురాతన భవనాలు ఆయా ప్రాంత వాసులను భయపెడుతున్నాయి. పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్నాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు కలవరం చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

వార్డు పరిధిలోని ఆర్‌కేపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సుమారు వంద మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాలకు ఆనుకుని పురాతన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం గోడల్లో మర్రి, చింత చెట్లు పెరిగాయి. పాఠశాల విద్యార్థులు విశ్రాంతి సమయంలో శిథిల భవనానికి సమీపంలో ఆడుకుంటారు. పొరపాటున భవనం ఆ సమయంలో కూలితో చెప్పలేని నష్టం తప్పదు. ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని భవనాన్ని తొలగించాలని స్థానిక వాసులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్‌ చేస్తున్నారు. అలాగే ఇదే వార్డు పల్లివీధి వద్ద పెంకుటిల్లు, శ్రీహరిపురం జవహర్‌నగర్‌ వద్ద పురాతన భవనం ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి వల్లఆయా ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థకు చేరిన పాత భవనం

బాబోయ్‌ పందులు


గాంధీజీవీధి ధోబీఖానాకు వెళ్లే మార్గంలో పందుల సంచారం


ఓ ఇంటి సమీపంలో గుంపుగా పందులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పందుల బెడద రోజు రోజుకూ అధికమవుతోంది. పందుల సంచారంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మల్కాపురం,గాంధీజీ వీధి ప్రాంతాల్లో నెల రోజులుగా పందులు గుంపులు,గుంపులుగా చేరుతున్నాయి.అవి ఇక్కడ వీధి కాలువలు.. సర్వీసురోడ్డుల్లో సంచరిస్తూ ఆ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి ఆనుకుని ఉన్న గెడ్డలో పదుల సంఖ్యలో పందులు సంచరిస్తూ వ్యర్థాలను సర్వీసురోడ్ల పైకి తీసుకువస్తున్నాయి.అలాగే సమీపంలోని పల్లివీధి,గొల్లవీధిలో సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. గాంధీజీ వీధి వద్ద గల ధోబీఖానా వద్ద పెద్ద కాలువలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు స్పందించడం లేదని ఆయా ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.

‘ఉక్కు పరిరక్షణకు మరో ముందడుగు’


802వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును కాపాడుకునే క్రమంలో కార్మికులంతా మరో ముందడుగు వేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్‌ ఆర్చి వద్ద జరుగుతున్న 802వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పులువురు కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయని బీజేపీతో సహా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి సహకరించని అన్ని రాజకీయ పార్టీలపై ప్రజలు స్వచ్ఛందకు తమ నిరసన తెలియజేయాలన్నారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణకు ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేనిచో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చైర్‌ ప్రొఫెసర్‌ ఏర్పాటుకు ఎంఆర్‌సీ గ్రూపు నిధులు


చైర్‌ ప్రొఫెసర్‌ ఏర్పాటుకు లేఖ అందిస్తున్న కొమ్మరెడ్డి రాంబాబు

ఏయూ క్యాంపస్‌: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చైర్‌ ప్రొఫెసర్‌ ఏర్పాటుకు ఎంఆర్‌సీ గ్రూప్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కొమ్మరెడ్డి రాంబాబు నిధులు అందజేశారు. తమ సంస్థ పేరుతో ఏయూలో చైర్‌ ప్రొఫెసర్‌ ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖతో పాటు ఇందుకు అవసరమైన నిధులను సైతం చెక్‌ రూపంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి సోమవారం ఉదయం అందజేశారు. విద్యను అందించి తమ అభివృద్ధికి దోహదపడిన విశ్వవిద్యాలయం సాధిస్తున్న ప్రగతి తనకు ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇస్తోందని రాంబాబు అన్నారు. వర్సిటీ అభివృద్ధిలో తామంతా భాగస్వాములం అవుతామన్నారు. ఏయూలో చైర్‌ ప్రొఫెసర్‌ ఏర్పాటుకు ముందుకువచ్చిన ఎంఆర్‌సీ సంస్థల మేనేజింగ్‌ డైరెక్టర్‌, ది కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ కొమ్మరెడ్డి రాంబాబును వర్సిటీ తరఫున వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్‌ చైర్‌ ప్రొఫెసర్‌ ఆచార్య ఎం.జేమ్స్‌ స్టీఫెన్‌, పాలక మండలి సభ్యుడు కె.వి.ఎస్‌.ఆంజేయవర్మ తదితరులు పాల్గొన్నారు.

మా భవిష్యత్తుకు జగనన్నే కావాలి

- మెజార్టీ శాతం ప్రజలు అదే కోరుకుంటున్నారు
- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ : రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు జగనన్ననే విశ్వసిస్తున్నారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్‌ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న మెగా పీపుల్స్‌ సర్వే ప్రజల అభిప్రాయాన్ని తెలియజేసేందుకు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ కోటి కుటుంబాలను ఈ సర్వేలో భాగస్వాములను చేయగా 79 శాతం జగనన్న పాలనపై విశ్వాసం కనబరిచారన్నారు. తూర్పు నియోజకవర్గంలో సైతం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కావాలని ప్రజలు పెద్ద ఎత్తున కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 30 వేల ఓట్ల మెజారిటీతో తూర్పు నియోజకవర్గం సీటును గెలుచుకోనున్నట్లు ఎంవీవీ వెల్లడించారు. అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల సంక్షేమ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ, తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

‘డీపీటీవోపై చర్యలు తీసుకోండి’

సీతమ్మధార: విశాఖ జిల్లాలో ఏపీ పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ డిపార్ట్‌మెంట్‌(ఏపీపీటీడీ), డిప్యూటీ పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఆఫీసర్‌(డీపీటీవో) ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఏపీపీటీడీ ఎస్‌ఎంయూ అసోసియేషన్‌ ప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సీతమ్మధార అర్బన్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలోకి తీసుకున్నారని గుర్తుచేశారు. దానికి తామంతా ఆయనకు రుణపడి ఉంటామన్నారు. ప్రస్తుత డీపీటీవో వచ్చినప్పటి నుంచి అన్ని డిపోల్లో బస్సుల సంఖ్య తగ్గించి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్‌ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 61, 62వ వార్డుల పరిధి ప్రకాష్‌నగర్‌లో వెలసిన లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్‌ బల్ల లక్ష్మణరావు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దైవ చింతనతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలన్నారు.

మర్యాద పూర్వకలయిక


కార్పొరేటర్‌ లక్ష్మణరావుకు పూలమొక్క అందిస్తున్న సీవో

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్‌ బల్ల లక్ష్మణరావును 62,63 వార్డుల నూతన మెప్మా సీవో ఇఫ్తార్‌ భాను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ లక్ష్మణరావు మాట్లాడుతూ పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేసి ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. తన పూర్తి సహాయ సహకారాలు అందించి మహిళా సాధికారత దిశగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్కా సూర్యనారాయణ, రామకృష్ణ, సంతోష్‌, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు రామానుజాచార్య జయంతి

మురళీనగర్‌: కప్పరాడ ఎన్‌జీజీవోస్‌ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భగవత్‌ రామానుజాచార్య జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామానుజాచార్యకు పంచామృతాభిషేకం, సాయంత్రం 6 గంటలకు తిరువీధి మహోత్సవం నిర్వహించి వైభవుడికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

వైభవంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు


పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదలకు సేవ చేయడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సత్యసాయి సేవా సమితి పెదగంట్యాడ, సత్యసాయి భజన మండలి వెంపళ్ల నగర్‌ ప్రతినిధి గళ్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో సత్యసాయి 12వ ఆరాధనోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, 74వ వార్డు కార్పొరేటర్‌ తిప్పల వంశీరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్‌ బొడ్డు నర్సింహపాత్రుడు హాజరై సత్యసాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు నిత్యావసరాలను అందజేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం 70 మంది పేదలకు 22 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

పప్పెట్‌ స్టోరీ టెల్లింగ్‌ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: పప్పెట్‌ స్టోరీ టెల్లింగ్‌ పోటీల్లో పాల్గొనేందుకు చిన్నారులకు పెపప్‌ సంస్థతో కలిసి జెమ్స్‌ ఎడ్యుకేషనల్‌ ఆర్గనైజింగ్‌ సంస్థ ఆహ్వానం పలుకుతోంది. పెపప్‌ మూడో ఎడిషన్‌ నిర్వహణలో భాగంగా మే 6న నగరంలోని రామ్‌నగర్‌ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ పోటీలు నిర్వహిస్తుంది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు ఫైనల్‌ రౌండ్‌ పోటీలు, 4.30 నుంచి 5.30 వరకు షాడో పప్పెట్‌ వర్క్‌షాపు, 6.30 నుంచి 7.30 వరకు పప్పెట్‌ షో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే చిన్నారులు 4 నిమిషాల వ్యవధిలో రికార్డ్‌ చేసిన స్టోరీని ఈ నెల 30లోగా 98494 88923కు వాట్సాప్‌ ద్వారా లేదా artoflearning22@gmail.comకు మెయిల్‌ చేయాలని కోరారు. స్టోరీకి మెటీరియల్‌ గ్లోవ్‌, స్ట్రింగ్‌, రాడ్‌, ఫింగర్‌, షాడోలను ఉపయోగించి ఫన్నీ, హర్రర్‌, ఫాంటసీ, మోరల్‌ ఆధారిత అద్భుత కథలు పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 90190 67760, 98494 88923లో సంప్రదించాలని నిర్వాహకురాలు కె.అమలారెడ్డి కోరారు.

కాలుష్య నియంత్రణకు దూరం..!

- ప్రజా రవాణాను వినియోగించని జోన్‌–5 అధికారులు
- ప్రభుత్వ, సొంత వాహనాల్లో కార్యాలయానికి రాక


జ్ఞానాపురంలోని జోన్‌–5 కార్యాలయ ఆవరణలో సోమవారం పార్క్‌చేసిన అధికారుల వాహనాలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్‌–5 అధికారులు, ఉద్యోగులు కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కాలేదనే చెప్పాలి. జీవీఎంసీ మేయర్‌, కమిషనర్‌, ఇతర ఉన్నతాధికారులు నగరాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడాలని పిలుపునిస్తూ ప్రతి సోమవారం వెహికల్‌–ఫ్రీ జోన్‌ పాటించి తమ వంతు కృషి చేస్తున్నారు. జోన్‌–5 అధికార గణం మాత్రం ఇందుకు దూరంగా ఉంటోందని పలువురు విమర్శిస్తున్నారు. జోన్‌–5లో ఇంజినీరింగ్‌, పబ్లిక్‌ హెల్త్‌, యూసీడీ, టౌన్‌ ప్లానింగ్‌, డెత్‌ అండ్‌ బర్త్‌, తాగునీరు, విద్యుత్‌ లైట్లు, రెవెన్యూ విభాగాల అధికారులు మాత్రం ప్రభుత్వ వాహనాలతోపాటు సొంత వాహనాల్లో ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోనల్‌ కార్యాలయానికి విధులకు వస్తున్నారు. ఇక్కడి సౌకర్యం కేంద్రానికి వచ్చే జోన్‌ ప్రజలు కూర్చోడానికి చోటులేకపోయినా.. జోనల్‌ విభాగాల అధికారుల వాహనాల పార్కింగ్‌తో కార్యాలయం ప్రతి సోమవారం కళకళలాడుతోందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, దాని కట్టడికి అందరి సహకారం అవసరమని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు కాలుష్య నియంత్రణకు వారంలో ఒక్కరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రభుత్వం సూచించినా.. జోన్‌–5 అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాలుష్య నియంత్రణకు జోనల్‌ అధికారులు, ఉద్యోగులు సహకరించాలని సూచిస్తున్నారు.

పారిశుధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ


పారిశుధ్యపనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ

సింహాచలం: సింహగిరితో పాటు అడవరం, కొండ దిగువన పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌వర్మ ప్రజా ఆరోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం అనంతరం సోమవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ వ్యర్థాలను వెంటనే డంపింగ్‌ యార్డ్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. పాత అడవివరం జంక్షన్‌ నుంచి పాత గోశాల గోశాల వరకు ఎక్కువగా వ్యర్థాలు ఉన్నాయని రెండు పూటలా పారిశుధ్య కార్మికులను ఉంచి శుభ్రం చేయించాలని సూచించారు. చెత్త తరలించే వాహనాలు అదనపు ట్రిప్పులు వేయాలని ఆదేశించారు. వ్యర్థాలు తరలించేటప్పుడు వాహనాలకు తప్పనిసరిగా నెట్‌ ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్‌ డాక్టర్‌ వి.సన్యాసిరావు, 8వ జోన్‌ కమిషనర్‌ మల్లయ్యనాయుడు, ఈఈ సంతోషి, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం


పట్టాలు అందుకున్న చిన్నారులతో కృష్ణారెడ్డి, సునీల్‌ రెడ్డి తదితరులు

గోపాలపట్నం: యూకేజీ నుంచి ఒకటో తరగతికి వెళ్లే విద్యార్థుల స్నాతకోత్సం ఎస్‌ఏడీ రామకృష్ణా పాఠశాలలో సోమవారం వేడుకగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్‌ రామకృష్ణారెడ్డి చిన్నారులకు పట్టాలు అందించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్ల మార్కులు, ర్యాంకులపై వ్యామోహం తగ్గించుకోవాలని సూచించారు. పిల్లల ఆసక్తి, వారి అభిరుచికి ప్రాధాన్యమిస్తూ ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ గూఢచారి సంస్థ విశ్రాంత ఉద్యోగి సత్తి సునీల్‌ రెడ్డి మాట్లాడుతూ తల్లి దండ్రులు పిల్లలతో ఎక్కు సమయం గడపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ జీవీ రవీంద్రుడు, వైస్‌ ప్రిన్సిపాల్‌ ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘ఏడాదిలో ఏఐటీయూసీతో ఒరిగింది శూన్యం’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచి ఏడాది పూర్తయినా కార్మికులకు ఒరిగిందేమి లేదని స్టీల్‌ ఐఎన్‌టీయూసీ, మిత్రపక్షాల నాయకులు ధ్వజమెత్తారు. స్టీల్‌ప్లాంట్‌ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి రాజశేఖర్‌ మాట్లాడుతూ కార్మికుల ప్రధాన డిమాండ్‌ వేతన ఒప్పందం చేయలేకపోయారన్నారు. ప్రైవేటీకరణ ఉద్యమంలో భాగంగా ఢిల్లీకి వెళ్తే తామే వైఎస్సార్‌ సీపీ, కాంగ్రెస్‌ ఎంపీలతో పాటు ఉక్కు మంత్రి, ఉక్కు కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం తప్ప, ఏఐటీయూసీ, సీఐటీయూ చేసిందేమి లేదన్నారు. అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీలు ఎల్‌టీసీ, ఎల్‌ఎల్‌టీసీ, లీవ్‌ ఎన్‌క్యాష్‌మెంట్‌, హెచ్‌బీఏ, వర్క్‌డ్రస్‌, ఇన్సెంటివ్‌ తగ్గింపు వంటి ఆర్థిక అంశాలపై కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ ఏఐటీయూసీ హయాంలో ఇప్పటికే కోక్‌ఓవెన్స్‌1, 2 బ్యాటరీలు ప్రైవేటు వారికి అప్పగించగా, మూడు, నాలుగు బ్యాటరీలకు, ఎస్‌.ఎం.ఎస్‌–2లో మిషన్‌–4కు నోటిఫికేషన్‌ జారీ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, నాయకులు ప్రభాకరెడ్డి, నాయక్‌, రఫీ, కరణం సత్యారావు, పరదేశి, సుదర్శనం, ఎస్‌.శ్రీనివాసరెడ్డి, మొల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫారం–1 చివరలో గల పార్సిల్‌ ఆఫీస్‌ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్‌ రైల్వే పోలీస్‌ (జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్‌ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ప్లాట్‌ఫారం–1 చివరలో సుమారు 25 ఏళ్ల గల ఓ వ్యక్తి మరణించాడని, తెలుపు రంగు ప్యాంట్‌, తెలుపు నలుపు రంగు చెక్స్‌ గల రౌండ్‌ నెక్‌ టీ షర్ట్‌ ధరించి ఉన్నాడని బాలాజీరావు చెప్పారు. ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీని గానీ లేదా 96661 22722 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలన్నారు.

జోన్‌-8 అధికారుల ఫోన్‌ నంబర్లు

అధికారి	పేరు	ఫోన్‌ నంబర్‌
జోనల్‌ కమిషనర్‌	మల్లయ్య నాయుడు	99123 49439
సూపరింటెండెంట్‌	పీవీవీఎస్‌ఎస్‌ మూర్తి	98481 12030
ఏసీపీ టౌన్‌ ప్లానింగ్‌	ఎస్‌ సస్టి షబ్నన్‌	98489 33236
టీపీఎస్‌	పి. ప్రమీల రాణి	81878 98438
శానటరీ సూపర్‌వైజర్‌	కేవీ రమణ	99488 83940
రెవెన్యూ అధికారి	వి. నారాయణరావు	98485 22347
ఏపీడీ	వై. శ్రీరామ్‌	77299 99788
ఈఈ వర్క్స్‌	సంతోషి కుమారి	99123 49485
ఈఈ ఎలక్ట్రికల్‌	డి. శ్రీధర్‌	99480 78504
ఈఈ యూజీడీ	వెంకటేశ్వరరావు	79897 72161
డీఈ వర్క్స్‌	జి. శ్రీనివాసరాజు	77299 95949
ఏఈ ఎలక్ట్రికల్‌	కె. రాధిక	77299 95942
ఏఈ వాటర్‌ సప్లై	కె. గణేష్‌ రాజశేఖర్‌	81878 99219